




# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం








సంపుటి : 3 | సంచిక : 238 | మార్చ్ 15 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


## ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి చేసిన కొన్ని గంటల్లోనే.. యూఏఈలో అతిపెద్ద టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్ దాడి




యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ)లో అతిపెద్ద ఇంధన నిల్వల కేంద్రమైన పుజైరా ఓడరేవుపై ఇరాన్ డ్రోన్‌లతో దాడి చేసింది. దీంతో ఇక్కడ తీవ్ర మంటలు చెలరేగాయి. ఈ పుజైరా చమురు కేంద్రం ప్రపంచంలోనే పెద్దది కావడం గమనార్హం. ఇది హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉంటుంది. హోర్ముజ్ జలసంధి మూసివేసినప్పటికీ ఈ పుజైరా ఇంధన నిల్వ కేంద్రం పోర్ట్ నుంచి చమురు ఎగుమతులు జరుగుంటాయి. ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి అనంతరం, కొన్ని గంటల్లోనే ఇరాన్ డ్రోన్ బాంబులతో విరుచుకుపడింది. ఈ దాడితో పుజైరాలో మంటలు, నల్లటి పొగ అలుముకుంది. అయితే ఇరాన్ డ్రోన్ తో దాడి జరపగా, ఆ డ్రోన్ ను పేల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్ శకలాలు పడిన ప్రాంతం నుంచి పొగలు వస్తున్నాయని స్థానిక అధికారులు చెబుతున్నారు. పుజైరా కీలక ఇంధన నిల్వ కేంద్రం కావడంతో ఇరాన్ దీనిని లక్ష్యంగా చేసుకుంది. పుజైరా ఆయిల్ డిపో, పోర్టుపై బాంబులు, మిస్సైల్లతో దాడికి పాల్పడింది. దాడికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన యూఏఈ పుజైరా చమురు పోర్టును తాత్కాలికంగా మూసివేసింది. చమురు ఎగుమతులు, దిగుమతులను నిలిపివేసింది. గల్ఫ్ దేశాల చమురు ఎగుమతులు, దిగుమతులకు ఇది ప్రధాన కేంద్రం. పుజైరా చమురు పోర్టును మూసివేస్తే భారత్, చైనా, పాకిస్థాన్ సహా వివిధ దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడే అవకాశం ఉంది.

## యుద్ధ ప్రభావం ప్రజలపై పడకుండా మేం చూస్తుంటే, కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది: మోదీ తీవ్ర ఆగ్రహం





పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు. మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి

## సీఎం రేవంత్ రెడ్డిని ఇఫ్తార్ విందుకు ఆహ్వానించిన మంత్రి అజారుద్దీన్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో మార్చి 15వ తేదీన ఈ విందును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని కలిసి ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ స్పందిస్తూ, "గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఈ పవిత్ర రంజాన్ మాసంలో మార్చి 15న జరిగే ఇఫ్తార్ విందుకు ఆహ్వానించాను. ఈ పవిత్ర సమయం

## ఖర్గ్ ఐలాండ్‌పై దాడి... అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్



ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి నేపథ్యంలో, ఇరాన్ అగ్రరాజ్యానికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఈ దాడిని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపింది. దీనికి ప్రతీకారం తప్పనిసరిగా తీర్చుకుంటామని అమెరికాను హెచ్చరించింది. అమెరికాతో సంబంధం ఉన్న చమురు కంపెనీలపై దాడులు తప్పవని తెలిపింది. చమురు కంపెనీల మౌలిక సదుపాయాలను బూడిద కుప్పలుగా మారుస్తామని ప్రకటించింది. ఖర్గ్

## ఇరాన్ యురేనియంపై పుతిన్ ప్రతిపాదనకు నో చెప్పిన ట్రంప్!

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన ఓ ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. ఇరాన్ శుద్ధిచేసిన యురేనియంను రష్యాకు తరలిస్తామని పుతిన్ ప్రతిపాదించగా, ట్రంప్ అంగీకరించలేదు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరువురు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. యుద్ధంలో ఇరాన్‌కు



## తెలంగాణలో వంటగ్యాస్ కొరత లేదు: ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణలో వంటగ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలు గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతాయని లేదా కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో ముందుగానే ఎక్కువగా బుక్ చేసుకుంటున్నారని, దీనితో సాధారణం కంటే రెట్టింపు సిలిండర్లు బుక్ అవుతున్నాయని తెలిపారు. తెలంగాణలో గృహ అవసరాలకు ఎలాంటి వంటగ్యాస్ కొరత లేదని, వాణిజ్య సిలిండర్ల కొరత మాత్రమే ఉందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని, ప్రస్తుత పరిస్థితులపై వారితో చర్చించామని మంత్రి తెలిపారు. తెలంగాణలో 1.3 కోట్ల మంది ఎల్పీజీ వినియోగదారు లు ఉన్నట్లు వెల్లడించారు. దీపం పథకం కింద 28 లక్షల మంది ఎల్పీజీని వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. గృహ వినియోగదారులు ప్రతి నెల 60 లక్షల సిలిండర్లు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు.



## మంత్రి లోకేశ్ ఇంట సంబరాలు... ఘనంగా దేవాన్ష్ పంచెకట్టు వేడుక

ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆయన కుమారుడు నారా దేవాన్ష్ పంచెకట్టు (ధోతీ) వేడుకను శనివారం కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంతోషకరమైన విషయాన్ని లోకేశ్ స్వయంగా సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. తన కుమారుడు భారతీయ సంప్రదాయాలను స్వీకరించడం చూసి గర్వపడుతున్నానని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను కూడా లోకేశ్ పంచుకున్నారు. "ఈ రోజు మా కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు అందరం కలిసి దేవాన్ష్ ధోతీ వేడుకను జరుపుకున్నాం. దేవాన్ష్ పెరిగి పెద్దవాడవుతూ మన సంప్రదాయాలను ఇంత మధురమైన రీతిలో స్వీకరించడం చూడటం మా అందరికీ గర్వకారణం. ఈ ప్రత్యేకమైన ఘట్టం నేపథ్యంలో, దేవాన్ష్‌కు జీవితాంతం సంతోషం, విజయం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వేడుకలో దేవాన్ష్ పంచెకట్టులో సంప్రదాయబద్ధంగా కనిపించాడు. లోకేశ్ పంచుకున్న ఫోటోలు ప్రస్తుతం



## మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం... ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా: పవన్ కల్యాణ్

తమది 'పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం' అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం నందిగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## సీఎం రేవంత్ రెడ్డిని ఇఫ్తార్ విందుకు ఆహ్వానించిన మంత్రి అజారుద్దీన్

(మొదటి పేజీ తరువాయి)

అందరిలో శాంతి, కృతజ్ఞత, ఐక్యతను తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను," అని పేర్కొన్నారు.రంజాన్ మాసంలో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. సూర్యాస్తమయం తర్వాత ఉపవాసాన్ని విరమించే ప్రక్రియనే ఇఫ్తార్ అంటారు. ఈ మాసంలో నాయకులు, ప్రముఖులు మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే మంత్రి అజారుద్దీన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

## యుద్ధ ప్రభావం ప్రజలపై పడకుండా మేం చూస్తుంటే, కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది: మోదీ తీవ్ర ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు.కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

## ఖర్గ్ ఐలాండ్‌పై దాడి... అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఐలాండ్‌పై అమెరికా దాడిని ధృవీకరించిన ఇరాన్, చమురు మౌలిక సదుపాయాలకు మాత్రం ఎలాంటి నష్టం జరగలేదని తెలిపింది. ఈ దాడిపై ఇరాన్ సాయుధ దళాల కార్యాలయం ప్రతినిధి ఒక ప్రకటనలో స్పందించారు. తమ చమురు మౌలిక సదుపాయాలపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో అమెరికాతో సంబంధం ఉన్న మౌలిక సదుపాయాలను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు.ఖర్గ్ ఐలాండ్... చమురుకు సంబంధించి ఇరాన్‌కు వ్యూహాత్మక హబ్. ఇరాన్ నుంచి ఎగుమతి అయ్యే దాదాపు 90 శాతం చమురు ఇక్కడే ప్రాసెస్ అవుతుంది. ఇలాంటి స్థావరంపై యూఎస్ సెంట్రల్ కమాండ్ తన ఆదేశాల మేరకు దాడి చేసిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఇక్కడి ముడి చమురు సదుపాయాల జోలికి మాత్రం వెళ్లలేదని, కేవలం సైనిక స్థావరాలనే దెబ్బతీశామని చెప్పారు. హార్ముజ్ జలసంధి వద్ద నౌకలను అడ్డుకుంటే చమురు సదుపాయాలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు.

## ఇరాన్ యురేనియంపై పుతిన్ ప్రతిపాదనకు నో చెప్పిన ట్రంప్!

(మొదటి పేజీ తరువాయి)

పరిమితస్థాయిలో రష్యా సహకరిస్తుందనే వార్తల నేపథ్యంలో ఇరువురు నేతలు సంభాషించుకున్నారు.రష్యా నుంచి ఇలాంటి ప్రతిపాదన ఇదే మొదటిసారి కాదని అమెరికా చెబుతోంది. ఇంతకుముందు కూడా పుతిన్ ఇలాంటి ప్రతిపాదనలు చేశారని అమెరికా ప్రతినిధి ఒకరు వెల్లడించారు. యురేనియం సురక్షితంగా ఉండేలా చూసుకోవాలనేది అమెరికా వైఖరి అని తెలిపారు. మరోవైపు, పుతిన్ చేసిన ప్రతిపాదనకు ఇరాన్ కూడా అంగీకరించే అవకాశం లేదని తెలుస్తోంది. యుద్ధానికి ముందు అమెరికాతో జరిగిన చర్చల సమయంలో కూడా ఇరాన్ ఇటువంటి అంశాలను అంగీకరించలేదని తెలుస్తోంది.

## మంత్రి లోకేశ్ ఇంట సంబరాలు... ఘనంగా దేవాన్ష్ పంచెకట్టు వేడుక

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పలువురు ప్రముఖులు, అభిమానులు దేవాన్ష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.ఇక, ఈ విశిష్ట వేడుకకు సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు హాజరై మనవడికి దీవెనలు అందించారు. అటు, దేవాన్ష్ తాతయ్య నందమూరి బాలకృష్ణ, అమ్మమ్మ వసుంధర కూడా హాజరై మనవడి పంచెకట్టు వేడుకను సంతోషంగా తిలకించారు.ఇక బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. తెలుగు సంప్రదాయం ప్రకారం మోక్షజ్ఞ మేనమామ హోదాలో దేవాన్ష్ కు కొత్త దుస్తులు బహూకరించాడు.




# మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం... ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా: పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

'మాట–మంతి' కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు భయపడేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగమే మీ గడప వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకునేలా పాలనను ప్రక్షాళన చేశాం. మీరు కష్టాలు చెప్పుకోవడానికి రోడ్ల మీదకు రాకముందే వాటిని పరిష్కరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని భరోసా ఇచ్చారు.గత ప్రభుత్వం నిధులు మళ్లించడం వల్లే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. "జలజీవన్ మిషన్ పథకంలో రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఏజెన్సీ గ్రామాల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాం. గిరి శిఖర గ్రామాల్లో గర్భిణీలు పడుతున్న డోలీ కష్టాలు ఇక కనిపించకూడదన్నదే మా లక్ష్యం" అని వివరించారు. కేవలం 40 గడపలున్న నందిగరువు గ్రామానికి రూ.2 కోట్లతో రోడ్డు నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు.జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని లక్షలాది మంది మధ్య కాకుండా, 70 ఏళ్లుగా రోడ్డుకు నోచుకోని మారుమూల గిరిజన గ్రామంలో జరుపుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పవన్ అన్నారు. "ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా మేము ఎక్కడా వివక్ష చూపించం. మీరు ఓట్లు వేశారా లేదా అని చూడకుండా, మీరు బాగుండాలనే పనిచేస్తాం. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ఇలాంటి ప్రాంతాలకు రావడానికి నాయకులు భయపడతారేమో కానీ, ప్రజల కోసం పనిచేసే నాకు ఎలాంటి భయాలు లేవు" అని స్పష్టం చేశారు.'మాట–మంతి'లో భాగంగా గ్రామస్థులు ప్రస్తావించిన పలు సమస్యలకు పవన్ కల్యాణ్ అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు. ఓనూరు పాఠశాల మరమ్మతులు, కొత్తపాలెం గ్రామానికి 1.6 కి.మీ. రోడ్డు మంజూరు, అసంపూర్తిగా ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ భవనాల పూర్తికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లకుండా అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీన 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. దీనితో తెలంగాణలో వినియోగం ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.



# రంజాన్ వేళ పాకిస్థాన్‌లో భగ్గుమంటున్న పెట్రోల్, డీజిల్ ధరలు

పవిత్ర రంజాన్ మాసం వేళ పాకిస్థాన్‌లో ఇంధన ధరలు భారీగా పెరగడం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోంది. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌పై ఏకంగా 55 రూపాయల మేర పెంచింది. దాంతో పెట్రోల్ ధర లీటర్ రూ.321కి పెరిగింది. డీజిల్ ధర కూడా అదే స్థాయిలో భగ్గుమంటోంది. ఈ పరిణామంతో దేశవ్యాప్తంగా రవాణా ఛార్జీల నుంచి నిత్యావసరాల ధరల వరకు అన్నింటిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంధన ధరల పెంపు మధ్యతరగతి కుటుంబాలు, రోజువారీ కూలీలపై పెనుభారం మోపుతోందని 'డాన్' పత్రిక తన నివేదికలో వెల్లడించింది.రంజాన్ మాసంలో సాధారణంగానే కుటుంబ బడ్జెట్‌లు ఒత్తిడికి గురవుతాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఉపశమనం కల్పించాల్సింది పోయి, ధరలు పెంచడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈద్ పండుగ ఖర్చుల కోసం సిద్ధమవుతున్న తరుణంలో ఈ భారం వారి కొనుగోలు శక్తిని దెబ్బతీస్తోందని నివేదిక పేర్కొంది. పాకిస్థాన్ ఎక్కువగా ఇంధన దిగుమతులపై ఆధారపడటంతో అంతర్జాతీయ మార్పులు దేశీయ ధరలను కుదిపేస్తున్నాయి. ధరల పెంపు ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే దేశంలోని కరాచీ, పెషావర్ వంటి ప్రధాన నగరాల్లో రవాణా ఛార్జీలు పెరిగాయి. దీంతో ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాది మంది రోజువారీ



ఖర్చులు అమాంతం పెరిగాయి. ఇంధన ధరలు పెరిగిన వెంటనే వ్యాపారులు నిత్యావసరాల ధరలను పెంచుతున్నారని, మరోవైపు పెషావర్‌లో పెట్రోల్ అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గినట్లు డీలర్లు చెబుతున్నారు. ఈ పరిణామాలతో ప్రజల ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయి.గమనిక: పైన తెలిపిన ధరలు పాకిస్థానీ రూపాయల్లో.

## రెండు ఎల్పీజీ నౌకలు హార్ముజ్‌ను దాటాయి... వంటగ్యాస్‌కు ఇబ్బంది లేదు: కేంద్ర ప్రభుత్వం

భారతదేశ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ నౌకలు శనివారం సురక్షితంగా హార్ముజ్ జలసంధిని దాటాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దీనితో హార్ముజ్‌కు ఇరువైపుల వందలాది నౌకలు నిలిచిపోయాయి. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో, భారత జెండాలు కలిగిన నౌకలు వెళ్లడానికి ఇరాన్ అంగీకరించింది. ఈ క్రమంలో రెండు నౌకలు హార్ముజ్‌ను దాటాయి.శివాలిక్, నందాదేవి పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

**వంట గ్యాస్ విషయంలో ఇబ్బంది లేదు**

గృహ వినియోగదారులకు వంట గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని కేంద్రం హామీ ఇచ్చింది. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. అవసరం లేకున్నా చాలామంది ఆందోళనతో బుకింగ్ చేస్తున్నారని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలని కోరినట్లు కేంద్రం తెలిపింది. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.వాణిజ్య సిలిండర్ల కొరతపై కూడా కేంద్రం స్పందించింది. ప్రాధాన్యత క్రమంలో వాణిజ్య సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపింది. ఎల్పీజీని అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. బుకింగ్ కోసం గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస గడువు ఉందని గుర్తు చేసింది.గల్ఫ్‌లో ఉండిపోయిన భారతీయ నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. అందులోని సిబ్బంది కూడా సురక్షితంగా ఉన్నట్లు వెల్లడించింది. హర్ముజ్ జలసంధి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపింది. నావికుల కుటుంబ సభ్యులకు సమాచారం ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని తెలిపింది.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

మార్చి । ఆదివారం । 15 । 2026



# నిశ్చితార్థం తర్వాత ఘోర విషాదం తల్లి-కూతురు ఆత్మహత్య



**మన దునియా,ఆంధ్రప్రదేశ్,బాపట్ల జిల్లా:మార్చి 14**

బాపట్ల జిల్లాలో జరిగిన ఓ విషాద ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. నిశ్చితార్థం జరిగి పెళ్లి పీటలు ఎక్కాల్సిన కుటుంబంలో అనూహ్యంగా విషాదం చోటుచేసుకుంది. కాబోయే వరుడు నమ్మకద్రోహం చేయడమే కాకుండా వ్యక్తిత్వ హననానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తల్లి--కూతురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మార్టూరు మండలం పరిధిలోని ద్రోణాదుల గ్రామంలో చోటుచేసుకుంది.ఆ గ్రామానికి చెందిన సిరికొండ శ్రీనివాసరావు కుమార్తె దివ్య హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. మంచి చదువులు పూర్తి చేసి ఉద్యోగం సాధించిన ఆమెకు కుటుంబ సభ్యులు మార్టూరుకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రావులకొల్లు శేషుబాబుతో వివాహం నిశ్చయించారు. గత ఏడాది డిసెంబర్ 14న ఇద్దరికీ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ వేసవిలో పెళ్లి జరగాల్సి ఉండగా అనూహ్యంగా పరిస్థితులు మారిపోయాయి.ఈ నెల 4వ తేదీన పెళ్లి సంబంధం విషయమై మాట్లాడుకోవాలని చెప్పి శేషుబాబు దివ్యను పిలిపించాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ సందర్భంగా దివ్యను రహస్యంగా అనుసరించి తీసిన కొన్ని ఫోటోలు, వీడియోలను చూపిస్తూ ఆమె ప్రవర్తన సరిగా లేదంటూ నిందలు వేసినట్లు సమాచారం. అదే సమయంలో పెళ్లి చేసుకోనని స్పష్టంగా చెప్పడంతో దివ్య, ఆమె తల్లి తీవ్ర ఆవేదనకు గురయ్యారు.అదే రోజు తల్లి--కూతురు ఇద్దరూ ఎలుకల మందు, గడ్డి మందు సేవించినట్లు తెలుస్తోంది. ఇంట్లో అపస్మారక స్థితిలో ఉన్న వారిని గమనించిన తండ్రి శ్రీనివాసరావు వెంటనే వారిని గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు వారిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ పరిస్థితి విషమంగా మారింది.వారం రోజులుగా చికిత్స పొందుతున్న దివ్య గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచింది. ఆమె మరణం తర్వాత కొద్ది గంటలకే తల్లి సుజాత కూడా ప్రాణాలు కోల్పోయింది. ఒకే కుటుంబంలో తల్లి--కూతురు ఇద్దరూ మరణించడంతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది.ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిశ్చితార్థం జరిగిన తర్వాత జరిగిన పరిణామాలు, ఫోటోలు--వీడియోల అంశం, పెళ్లి రద్దు వెనుక ఉన్న కారణాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. అవసరమైతే సంబంధిత వ్యక్తులను విచారించి నిజానిజాలు వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నారు. పెళ్లి జరగాల్సిన ఇంట్లో ఇలా విషాదం చోటుచేసుకోవడం అందరినీ కలచివేసింది.

# కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు...





**మన దునియా,భద్రాచలం:మార్చి 14**

వెంకటాపురం మండలం ఎంపీడీవో కార్యాలయం వద్ద కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మండల నాయకులు...వెంకటాపురం మండలంలోని 32 కుటుంబాలకు అక్షరాల 32,04,872రూ,,లు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదగా సంబంధితలకు అందజేయడం జరిగింది.మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర మారుమూల ప్రాంత ప్రజలకు అందిస్తున్నందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ధనసరి సీతక్క, రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్ గ్రహీత వేణు ఊడుగుల ను సన్మానించిన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్

**మట్టిలో మాణిక్యాలను సినీ పరిశ్రమకు పరిచయం చేస్తున్న వేణు ఊడుగుల ఆదర్శనీయుడు**

**బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్**

**మన దునియా,హైదరాబాద్: మార్చి14**

2025 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం బిగద్దర్ తెలంగాణ ఫిలి అవార్డ్స్ ప్రకటించగా వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, ఉప్పరపల్లి గ్రామ వాస్తవ్యులు వేణు ఊడుగుల నిర్మించిన చిత్రం "రాజు వెడ్స్ రాంభాయి" కి ఉత్తమ చిత్రం అవార్డుతో పాటు ఉత్తమ డైరెక్టర్ గా సాయిలు కంపాటి, ఉత్తమ నేపథ్య గాయకుడి గా అనురాగ్ ,ఉత్తమ మేల్ యాక్టర్ గా చైతు జొన్నల గడ్డ లకు అవార్డ్స్ రావడం సంతోషకరమైన విషయం అని,ఈ సందర్భంగా శనివారం నాడు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని జూబ్లీ హిల్స్ లోనీ వారి ఆఫీస్ కి వెళ్ళి వేణు ఊడుగుల కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ అచ్చమైన తెలంగాణ గ్రామీణ నేపథ్యం గల సినిమాలకు ఆదరణ పెరుగుతున్నందుకు సంతోషం అని, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వేణు ఊడుగుల కిందిస్థాయిలో ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి చేరుకున్నారని,కష్టం విలువ తెలిసిన వ్యక్తిగా సినీ రంగంలో ఎందరినో ప్రోత్సహిస్తున్నారని, ఆ కోవలోకే రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు కాంపాటి వస్తారని,ఇంకా సినీ పరిశ్రమలో మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి, సినీ గేయ రచయిత మట్టపల్లి సురేందర్ లాంటి ఔత్సాహికులను ప్రోత్సహిస్తు మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి వారికి అవకాశాలు ఇవ్వడం పలువురు సినీ ప్రముఖులకు ఆదర్శనీయం అని అన్నారు.సామాజిక విలువలతో సినిమాలు తీస్తున్న వేణు ఊడుగుల కు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ మిత్రులు అభిమానులు, బంధువులు,సహచరులు ప్రత్యక్షంగా పరోక్షంగా అభినందనలు తెలియజేస్తున్నారని, భవిష్యత్తులో వేణు ఊడుగుల నిర్మాతగా ,డైరెక్టర్ గా మరిన్ని ఉత్తమమైన సినిమాలు తీసి ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలని ఆశిస్తున్నామని అన్నారు. గద్దర్ అవార్డు గ్రహీత, డైరెక్టర్, నిర్మాత వేణు ఊడుగుల మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో టాలెంట్ ఉన్న యువకులకు సినీ రంగంలో అవకాశాలు కల్పిస్తామని అందుకు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, మనుషులను బి మనసులను కలిపే వారధి సమాజ సేవకుడు దేవేందర్ ముదిరాజ్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దుండి అశోక్, పోలేపాక రాజు, బోనాల రమేష్,పంతంగి భాస్కర్, వెల్దండి మధు,పులి రంజిత్, రాచర్ల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.



# పెళ్లికి నిరాకరించిందని యువతికి హెచ్‌ఐవీ రక్తంతో ఇంజెక్షన్... హైదరాబాద్‌లో దారుణం

**మన దునియా,హైదరాబాద్,మార్చి 14**




హైదరాబాద్‌లోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలన ఘటన చోటుచేసుకుంది. పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో ఓ యువకుడు యువతికి హెచ్‌ఐవీ ఉన్న రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పోచారానికి చెందిన మనోహర్ అనే యువకుడితో బాధిత యువతికి ఇటీవల వివాహం నిశ్చయమైంది. అయితే నిశ్చితార్థం తర్వాత మనోహర్‌కు హెచ్‌ఐవీ ఉన్నట్టు తెలిసింది. దీంతో యువతి, ఆమె కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. ఈ విషయం మనసులో పెట్టుకున్న మనోహర్ యువతిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 11న యువతి ఇంటికి వెళ్లిన మనోహర్ మరోసారి పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. అయితే యువతి తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో ముందే సిద్ధం చేసుకున్న సిరంజితో హెచ్‌ఐవీ పాజిటివ్ రక్తాన్ని బలవంతంగా ఇంజెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఘటన తర్వాత యువతికి అస్వస్థతగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత అసలు విషయం బయటపడింది. దీంతో యువతి తండ్రి పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు మనోహర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురి చేసింది. యువతి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

# టీటీడీ తరహాలో కొండగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం: బండి సంజయ్

**మన దునియా,కొండగట్టు:మార్చి 14**



టీటీడీ తరహాలో కొండగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం: బండి సంజయ్ తెలంగాణ : రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కొండగట్టు అంజన్న ఆలయాన్ని టీటీడీ తరహాలో అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న, ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలను నిర్లక్ష్యం చేసిందని, అభివృద్ధికి నిధులు కేటాయించలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాలను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# పేదింటి ఆడపడుచు పెళ్లికి కాంగ్రెస్ ఆశీస్సులు..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**లింగారెడ్డి గూడా గ్రామంలో ఐదు మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**

**మన దునియా,లింగారెడ్డి గూడా: మార్చి14**



పేదింటి ఆడపడుచుల పెళ్ళికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం అండగా నిలబడుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో 5 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివాహం ప్రస్తుత తరుణంలో అత్యంత ఖరీదైనదిగా మారిందని, ఈ నేపథ్యంలోనే పేద మహిళలకు అండగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, సాయిరాం, రంగంపల్లి రమేష్ గౌడ్, ఎర్రోళ్ల జంగయ్య, ఫకీర్ భాష, అరుణ్ కుమార్, లక్ష్మీకాంత్ రెడ్డి, ఖదీర్, పక్కనే చిన్న, నరసింహ, ఒక్కని శివ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్కీ దారులు అప్పన్న గారి శోభ, ఎర్రోళ్ల చంద్రకళ, పక్కనే అరుణ, అత్యం మాధవి, బొగురాం యాదమ్మ ఈ చెక్కులను అందుకున్నారు..

# క్రేన్ వైరు తెగి బావిలో పడిన యంత్రం.. ముగ్గురు దుర్మరణం

**మన దునియా,జయశంకర్, భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి కొరికిశాల:మార్చి 14**

జయశంకర్, భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామంలో శనివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ వైరు తెగిపోవడంతో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బావిలోపల మట్టిని తొలగిస్తున్న సమయంలో క్రేన్ ఒక్కసారిగా లోపల ఉన్న వారిపై పడటంతో ఈ దారుణం జరిగింది. ఈ ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను కొరికిశాల గ్రామానికి చెందిన సుకిన దేవారావు (48), బండారి అభిలాష్ (16) మరియు పిడిసిల్ల గ్రామానికి చెందిన సరిగొమ్ముల (53)గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాలను బావిలో నుండి వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ పోషణ కోసం పనికి వెళ్లిన వారు విగతజీవులుగా మారడంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# గ్రామ రక్షణ - అందరి బాధ్యత

**సీసీ కెమెరాల ఏర్పాటుతో నేర రహిత సమాజాన్ని నిర్మిద్దాం**

**ముస్మి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు**

**మన దునియా మహబూబాబాద్ జిల్లా,కొత్తగూడ:మార్చి 14**




మహబూబాబాద్ జిల్లా::: కొత్తగూడ మండలంలో భద్రత దిశగా అడుగులు పడుతున్నాయి. నేరాల నియంత్రణే లక్ష్యంగా ముస్మి గ్రామంలో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే....కొత్తగూడ మండలం ముస్మి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామ సర్పంచ్ దేవేందర్ గారు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సర్పంచ్ సహకారంతో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో రెండు సీసీ కెమెరాలను అమర్చారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా, దొంగతనాల నియంత్రణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ముస్మి గ్రామంలో నిఘా గ్రామంలోకి వచ్చే వారు, వెళ్లే వారి కదలికలను ఇకపై 24 గంటల పాటు ఈ కెమెరాలు రికార్డ్ చేస్తాయి.నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు 'మూడవ కన్ను'లా పనిచేస్తాయని, కొత్తగూడ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ రాజ్ కుమార్ ఈ సందర్భంగా కోరారు.ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నేరస్తులను త్వరగా పట్టుకోవడానికి ఈ సాంకేతికత పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

# కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**నెహ్రూ నాయక్, బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి**

**మన దునియా,మహబూబాబాద్ జిల్లా/కొత్తగూడ:మార్చి 14**



?మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ::యాసంగి సీజన్ ముగిసి మొక్కజొన్న పంట చేతికి వచ్చినా, ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంపై బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని దళారులు ఆవకాశంగా తీసుకుంటున్నారని, తమకు నచ్చిన తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ గిరిజన, గిరిజనేతర రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

రైతుల ఆవేదన: చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొందని నెహ్రూ నాయక్ పేర్కొన్నారు. దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే తక్షణమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

”మార్క్ఫెడ్ అధికారులు వెంటనే స్పందించి, మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలని తెలియజేశారు.?ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మండలంలో నిఘా నేత్రాల సందడి

**నేర పరిశోధనలో సి.సి. కెమెరాలు కీలకం: ఎస్పై రవికుమార్**

**మన దునియా,మహబూబాబాద్ జిల్లా,గంగారం:మార్చి 14**





మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఎస్పై రవికుమార్ పిలుపు మేరకు మండలంలోని పలు గ్రామాల్లో అధునాతన సోలార్ సి.సి. కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచుల చొరవ గ్రామాల్లో నేరాల నియంత్రణకు, అపరిచిత వ్యక్తుల కదలికలను గమనించడానికి సి.సి. కెమెరాలు ఎంతో అవసరమని గుర్తించిన పలువురు సర్పంచులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. తిరుమలగండి గ్రామ సర్పంచ్ కృష్ణారావు,?మడగూడెం గ్రామ సర్పంచ్ సురేష్,బావురగొండ గ్రామ సర్పంచ్ వీరభద్ర పోతయ్య వీరి ప్రత్యేక సహకారంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సోలార్ విద్యుత్‌తో పనిచేసే సి.సి. కెమెరాలను విజయవంతంగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్పై రవికుమార్ మాట్లాడుతూ... సీసీ కెమెరాలు అనేవి గ్రామానికి రక్షణ కవచంలా, మూడవ కన్నులా పనిచేస్తాయి. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు నేరస్థులను త్వరగా పట్టుకోవడానికి ఈ దృశ్యాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.?మండలంలోని మిగతా గ్రామాల సర్పంచులు కూడా తమ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి.?వ్యాపార సముదాయాల యజమానులు, ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాల బాధ్యులు తప్పనిసరిగా తమ ఆవరణల్లో కెమెరాలు అమర్చుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భారీగా పడిపోతున్న కోడిగుడ్డు ధర..

**మన దునియా,హైదరాబాద్ మార్చి 14**

పశ్చిమాసియాలో యుద్ధం పరోక్ష ప్రభావం దేశంలోని వివిధ రంగాలపై కనిపిస్తోంది. గ్యాస్ ధరల నుండి ఆటో ఛార్జీల వరకు ప్రతిదీ జేబులపై భారం పడుతోంది.అయితే, గుడ్డు ధరల విషయానికి వస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో గుడ్డు ధరలు సగానికి తగ్గాయి. పెద్ద వ్యాపారులు తీవ్రంగా దెబ్బతిన్నారు. గత కొన్ని రోజులుగా గుడ్డు ధరలు సగానికి తగ్గుతున్నాయి. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో ఖచ్చితంగా తెలియదు. ఫలితంగా గుడ్డు మార్కెట్లో అనిశ్చితి పెరుగుతోంది.యుద్ధం కారణంగా భారతదేశం నుండి గల్ఫ్ దేశాలకు గుడ్ల ఎగుమతులు ఆగిపోయాయి. ఫలితంగా ధరలు గణనీయంగా తగ్గాయి. జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ అందించిన డేటా ప్రకారం, గత కొన్ని వారాలలో తెలుగు రాష్ట్రాలతో సహా చాలా రాష్ట్రాల్లో గుడ్ల ధరలు భారీగా తగ్గాయి. గతంలో గుడ్డు ధర రూ. 7.06 ఉండగా, కేవలం ఒక వారంలోనే రూ. 4.20కి తగ్గింది. అంటే దాదాపు సగానికి సగం తగ్గిపోయింది ధర.పలు రాష్ట్రాల్లో ప్రతిరోజూ మిలియన్లకొద్దీ గుడ్లు ఉత్పత్తి అవుతాయి. అత్యధికంగా హోస్పేటలో గుడ్లు ఉత్పత్తి అవుతాయి. అయితే గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్న గుడ్ల కంటైనర్ యుద్ధం కారణంగా వెనక్కి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమిళనాడు, కర్ణాటకల నుంచి గల్ఫ్ దేశాలకు ప్రతి రోజు పెద్ద మొత్తంలో గుడ్లు ఎగుమతి అవుతాయి. దాదాపు 100 మిలియన్లకుపైగా గుడ్లు ఎగుమతి అవుతాయి. అయితే, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో ఆ ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది.ముస్లింల పవిత్ర మాసం రంజాన్ ప్రారంభం కావడంతో గుడ్ల వినియోగం కూడా తగ్గింది. తక్కువ వినియోగం, అధిక ఉత్పత్తి ధరల తగ్గుదలకు దారితీసింది. ధరలు తగ్గినప్పటికీ, గుడ్ల ఉత్పత్తి కొనసాగుతోంది. ఇది నిల్వలకు దారితీస్తుంది. ఉత్పత్తిదారులు అదనపు



గుడ్లను కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేస్తున్నారు. అక్కడ వాటిని మూడు నెలల వరకు నిల్వ చేయవచ్చు.

ఏపీ, తెలంగాణలో ఇదే పరిస్థితి:

ఇక ఏపీ, తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి. రెండు నెలల క్రితం రూ.8 ఉన్న గుడ్డు ధర ఇప్పుడు సగానికి తగ్గింది. రాష్ట్రం ప్రతిరోజూ దాదాపు 35 మిలియన్ గుడ్లను ఉత్పత్తి చేస్తుంది. రాష్ట్ర వార్షిక గుడ్ల ఉత్పత్తి దాదాపు రూ.18,600 కోట్లు. ఇది భారతదేశంలో మూడవ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో గుడ్ల ధర సాధారణంగా ఏడాది పొడవునా రూ.5 నుండి 6 వరకు ఉంటుంది. కొన్నిసార్లు రూ.7 కంటే ఎక్కువగా ఉంటుంది. అయితే మార్కెట్ ధర ఇప్పుడు రూ.3.50 నుండి 3.80 వరకు తగ్గింది. ఫలితంగా గుడ్డుకు దాదాపు రూ.1.50 నష్టం వాటిల్లింది. అయితే హైదరాబాద్‌లో ప్రస్తుతం డజన్ గుడ్ల ధర రూ.50 వరకు ఉంది. ఇక ఏ పీలో కూడా ఇదే ధర కొనసాగుతోంది.

# గ్యాస్ కనెక్షన్ కేవైసీ అప్‌డేట్ పేరుతో ఏపీకే ఫైల్స్.. జాగ్రత్త!! సీపీ సజ్జనార్

**మన దునియా,హైదరాబాద్: మార్చి 14**

హైదరాబాద్: గ్యాస్ కనెక్షన్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలంటూ సైబర్ కేటుగాళ్లు సరికొత్త మోసాలు చేస్తున్నారు. మీ మొబైల్‌కు వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే గుర్తుతెలియని లింక్‌లు క్లిక్ చేసి, వారు పంపిన ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ చేసుకుంటే మీ బ్యాంకు ఖాతా క్షణాల్లో ఖాళీ అవ్వడం ఖాయం.. తస్మాత్ జాగ్రత్త! ఒక చిన్న యాప్ డౌన్లోడ్ చేస్తే చాలు, మీ కష్టార్జితం మొత్తం నేరగాళ్ల పాలవుతుంది. మహారాష్ట్రలో వెలుగుచూసిన తాజా ఘటనే ఇందుకు నిదర్శనం.మహారాష్ట్రలోని డోంబివాలి ప్రాంతంలో ఇద్దరు మహిళలకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాము ప్రముఖ గ్యాస్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామని, గ్యాస్ సిలిండర్ సమాచారాన్ని వెంటనే అప్‌డేట్ చేయాలని నమ్మించారు. ఆ తర్వాత వాట్సాప్‌లో ఒక ఏపీకే ఫైల్ పంపించి మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసి, అందులో ఉన్న ఫారం నింపాలని సూచించారు. ఆ మహిళలు వారు చెప్పినట్లే ఆ ఫైల్ ఇన్‌స్టాల్ చేసి వివరాలు నమోదు చేయగానే.. వారి బ్యాంకు ఖాతాల నుంచి ఏకంగా నాలుగు లక్షల రూపాయలు మాయం అయ్యాయి. ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు పంపే ఏపీకే ఫైల్స్ చాలా ప్రమాదకరమైనవి. వీటిని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయగానే, మన మొబైల్ నియంత్రణ మొత్తం వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు, బ్యాంకు మెసేజ్‌లు అన్నీ వారికి నేరుగా చేరిపోతాయి. దీని ద్వారా తెలియకుండానే ఖాతాల్లోని డబ్బును కాజేస్తారు. గ్యాస్ ఏజెన్సీలు గానీ, ప్రభుత్వ సంస్థలు గానీ వివరాలు నమోదు చేయడానికి ఎప్పుడూ ఇలాంటి




థర్డ్–పార్టీ ఫైల్స్ పంపవని ప్రజలు గ్రహించాలి. అపరిచితులు పంపే యాప్స్‌ను అసలే ఇన్‌స్టాల్ చేసుకోవద్దు.గ్యాస్ బుకింగ్ లేదా కేవైసీ కోసం ఎల్లప్పుడూ అధికారిక యాప్స్, వెబ్‌సైట్లను మాత్రమే వినియోగించాలి. ఏదైనా అనుమానం వస్తే నేరుగా మీ గ్యాస్ ఏజెన్సీ ఆఫీసుకు వెళ్లి సంప్రదించడం ఉత్తమం.ఒకవేళ పొరపాటున ఎవరైనా ఇలాంటి సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయండి. సైబర్ క్రైమ్ పోర్టల్ cybercrime.gov.in లో ఫిర్యాదు చేయండి. ఆన్‌లైన్ మోసాలకు అప్రమత్తతే అసలైన విరుగుడు. దయచేసి ఈ సమాచారాన్ని మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేసి వారిని సైతం అప్రమత్తం చేయండి.

# ఎన్నికల హామీ నెరవేర్చిన సర్పంచ్

**ఏటూరునాగారంలో పుట్ట రూపంలో వెలిసిన ఎల్లమ్మ తల్లి ఆలయ స్లాబ్ పనుల ప్రారంభం.**

**మన దునియా,ఏటూరునాగారం: మార్చి 14**

స్థానిక రామాలయం సమీపంలో పుట్ట రూపంలో స్వయంభూగా వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణంలో నేడు అత్యంత కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఇక్కడ పుట్టనే సాక్షాత్తు శక్తి స్వరూపంగా భావించి భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. నేడు ఈ పవిత్ర అమ్మవారి ఆలయ ప్రధాన మండపానికి స్లాబ్ వేసే పనులను ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు గారు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఘనంగా ప్రారంభించారు.

మాట నిలబెట్టుకున్న సర్పంచ్

గత సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ బాధ్యతను కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు గారు భుజాన వేసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం నేడు ఆలయ నిర్మాణంలో ప్రధాన ఘట్టమైన స్లాబ్ పనులను ప్రారంభించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పుట్ట రూపంలో అమ్మవారి మహిమ: ఏటూరునాగారంలో పుట్ట రూపంలో వెలిసిన అమ్మవారి మహిమ చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఎంతో ప్రసిద్ధి. అటువంటి పవిత్ర పుట్టకు రక్షణగా, భక్తులు సౌకర్యవంతంగా మొక్కులు చెల్లించుకునేలా ఆలయాన్ని నిర్మిస్తున్నారు.కాకులమర్రి దంపతులు స్వయంగా నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ, ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. నేడు స్లాబ్ వేసే కార్యక్రమం సందర్భంగా పుట్ట వద్ద ప్రత్యేక అభిషేకాలు,



పూజలు నిర్వహించి గ్రామానికి అంతా మేలు జరగాలని ప్రార్థించారు.ఎన్నికల వాగ్దానం మేరకు ఆలయ పనులను వేగంగా పూర్తి చేసి, అతి త్వరలోనే భక్తులందరికీ అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాలయం గుడి చైర్మన్ అల్వాల శ్రీనివాస్ గారు, దన్నపు నేని కిరణ్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చంద్రబాబు, వార్డు సభ్యులు కొండాయి చిన్ని, రామాలయం గుడి కమిటీ సభ్యులు, కత్తెర శ్రీను, కాకులమర్రి అరుణ,దీనబంధం స్వామి అయ్యగారు, జాడి బోజారావు, దాసరి బుజ్జయ్య, చిత్తు బొత్తుల సదానందం , బ్రహ్మం, పెండాల సంతోష్, ఎర్రల ఎల్లయ్య,గుడిమెట్ల కనక తార, వెలకంటి శ్రీను, బాల్య రాజేష్,కుమ్మరి నరేష్, కుమ్మరి రాజు, సంతోష్, నాగరాజు, కొండాయి రాజు, నరసింహులు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడు, కోడలిని ఆశీర్వదించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

**మన దునియా,హైదరాబాద్: మార్చి 14**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు విచ్చేసి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షి దంపతులను ఆశీర్వదించారు.ప్రజాభవన్‌కు చేరుకున్న చంద్రబాబు గారిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క--నందిని దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.గత మార్చి 5వ తేదీన సూర్య విక్రమాదిత్య వివాహ వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భట్టి విక్రమార్క గారు స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి చంద్రబాబును వివాహానికి ఆహ్వానించారు. అయితే అప్పట్లో ఉన్న అత్యవసర కార్యక్రమాలు, బిజీ షెడ్యూల్ కారణంగా చంద్రబాబు గారు వివాహానికి హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలోనే నేడు ప్రత్యేకంగా ప్రజాభవన్‌కు



విచ్చేసి నూతన దంపతులకు తన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

# ములుగు జిల్లా 'నిర్భయ నిధి' పథకంలో ఎంపిక మహిళల, బాలికల భద్రతకు కొత్త దిశ

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 14**

కేంద్ర ప్రభుత్వం మహిళలు, బాలికల కోసం చేపట్టిన "సమ్మిళిత నగరాలు" కార్యక్రమంలో తెలంగాణలోని ములుగు జిల్లా ఎంపిక చేయబడింది. ఈ నిర్ణయం పట్ల తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. శనివారం, ఢిల్లీలోని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవిని సమావేశించి, ములుగు జిల్లాను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యాంశాలు:

ఈ పథకం ద్వారా ములుగు జిల్లాలో మహిళలు, బాలికల భద్రత, గౌరవం, రాకపోకల సౌకర్యం మెరుగుపరచడానికి జెండర్-రెస్పాన్సివ్ మౌలిక సదుపాయాలు, నిఘా వ్యవస్థలు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు.ప్రాజెక్ట్ విజయవంతం కావాలంటే, అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించడంలో జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి సీతక్క చెప్పారు.మహిళా సాధికారత, భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల రక్షణను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.కేంద్రం అమలు




చేస్తున్న 'పాలనా' మిషన్ శక్తి పథకం కింద పనిచేస్తున్న క్రెచ్ వర్కర్లు, హెల్పర్ల వేతనాలను పెంచాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం క్రెచ్ వర్కర్లకు నెలకు రూ. 5,500, హెల్పర్లకు రూ. 3,000 మాత్రమే ఇవ్వబడుతుండటాన్ని, ఇది వారి బాధ్యతలకు తగినంత కాదని కేంద్రానికి తెలిపారు. ఒక్క క్రెచ్‌లో సుమారు 25 మంది పిల్లల సంరక్షణ బాధ్యతను నిర్వహించడం చాలా కష్టం కాబట్టి, వేతనాలను ప్రస్తుత జీవన ప్రమాణాలకు అనుగుణంగా పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మహిళా సాధికారత, శిశు సంక్షేమం కోసం పనిచేస్తున్న సిబ్బంది ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వ దృష్టి అవసరమని, కేంద్రం సానుకూలంగా స్పందించాలని మంత్రి సీతక్క అభ్యర్థించారు.

# మాజీ డీజీపీ హెచ్. జె. దొరకు: పోలీస్ అధికారులు పాడె మోసి వీడ్కోలు

**మన దునియా,హైదరాబాద్:మార్చి14**

మాజీ డీజీపీ హెచ్. జె. దొరకు అనారోగ్యంతో నిన్న మరణించగా, ఈ రోజు హైదరాబాద్లో ఆయనకు అంత్యక్రియలు నిర్వహించబడ్డాయి.పోలీస్ శాఖలో పవర్ఫుల్ ఆఫీసర్‌గా గుర్తింపు పొందిన దొరకు, పోలీస్ అధికారులు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్ హాజరై పాడె మోసి, హృదయపూర్వకంగా వీడ్కోలు పలికారు. తన కర్తవ్యం, కృషి, మరియు నిబద్ధతతో ఎంతోమంది పోలీసులకు స్ఫూర్తిగా నిలిచిన ఆయనకు అశ్రు నయనాలతో చివరి నివాళి అర్పించబడింది.ఈ సందర్భంలో పలువురు అధికారులు, సీనియర్ సిబ్బంది దొర సేవలను కొనియాడుతూ, ఆయన కృషి, దృఢ నిబద్ధత, మరియు పోలీస్ శాఖలో చూపిన ఆదర్శప్రాయ నాయకత్వాన్ని గుర్తుచేశారు. పోలీస్ కమ్యూనిటీలో ఆయన పేరు ఎల్లప్పుడూ గౌరవంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.మాజీ డీజీపీ దొరకు, పవర్ఫుల్ ఆఫీసర్‌గా మాత్రమే కాకుండా, ఓ హృదయపూర్వక నాయకుడిగా పోలీస్ సిబ్బందికి, మరియు ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన సేవలు, అనుభవాలు, మరియు ధైర్యం తరం తర్వాతి పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిగా మారతాయి.



## షాద్ నగర్ లో "కబ్జా కోరుల" హల్చల్

**అలంపూర్ టూ షాద్ నగర్**

**అమాయకుల స్థలాలే టార్గెట్ గా కబ్జా**

**బయటి వ్యక్తుల రాకతో హంగామా**

**మన దునియా,షాద్ నగర్:మార్చి 14**




షాద్ నగర్ పట్టణంలో ఓ స్థల వివాదం ఇప్పుడు హాట్ టాపిక్ గా మరిది. ప్రశాంతంగా జీవిస్తున్న స్థానికుల ఇళ్లస్థలాల మధ్య కుంపటి రేపి కబ్జాలు చేసేందుకు కొందరు కాకలు తీరారు. పట్టణంలోని చటాన్ పల్లి వద్ద చోటుచేసుకున్న ఈ ఘటనపై స్థానికులు పట్టణ ప్రజలు, బాధితులు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఆలంపూర్ నుండి షాద్ నగర్ కు కబ్జా కోసం వచ్చిన "ఓ గుంపు" అమాయక జనాలపై పడి భయభ్రాంతులకు గురిచేస్తుంది. అమాయకుల ఇళ్ల స్థలాలలో పాగా వేస్తున్న కబ్జారాయుళ్ల వ్యవహారంపై స్థానికులు కొందరు పోలీసులకు ఈరోజు సాయంత్రం ఫిర్యాదు చేశారు. అమాయక గిరిజనుల ఇంటి స్థలాన్ని లాక్కుంటున్న గుంపుపై చర్యలు తీసుకోవాలని స్థానిక బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఈరోజు శనివారం పట్టణంలో సంబంధిత స్థలంలో స్థానికులకు ఈ గుంపుకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సంబంధిత స్థలాల్లో బహిరంగంగా టెంట్ వేసి తమ సత్తా చాటుకుంటున్న బయట వ్యక్తుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెంట్ వేసి మరి స్థానికులకు ఇబ్బందికి గురిచేస్తున్న వ్యవహారంపై స్థానికులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది శాంతి భద్రతల సమస్యగా మారే అవకాశం కూడా ఉందని అంటున్నారు. ప్రశాంత వాతావరణం లో ప్రకంపనలు రేపుతున్న కబ్జారాయుళ్ల వ్యవహారంపై పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పట్టణంలోకి ప్రవేశిస్తున్న బయట వ్యక్తుల వ్యవహారంపై పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. బయటి వ్యక్తులు స్థానికులను ఇంటి స్థలాల కోసం బెదిరిస్తున్నారని ఇల్లు కూల్చుతామని స్థలాలు కబ్జా చేస్తామని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. అసలు కబ్జా చేస్తున్నది ఎవరు? ఎంత పెద్దవారు? హాలో షాద్ నగర్ లో పూర్తి కథనాలు త్వరలో మీకోసం..




## సర్పంచ్ సక్రు నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన రితేష్ రాథోడ్...

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్ )మార్చ్: 14,**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని కవ్వాల్ గ్రామ సర్పంచ్ లకావత్ సక్రు నాయక్ పెద్ద కుమారుడు గణేష్ ఇటీవల మరణం చెందడం పట్ల నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రితేష్ రాథోడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం జన్నారం మండల కేంద్రంలోని సర్పంచ్ నివాసానికి చేరుకున్న ఆయన,గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం పుత్రశోకంతో ఉన్న సర్పంచ్ సక్రు నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో భగవంతుడు ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. రితేష్ రాథోడ్ వెంట బీజేపీ మండల నాయకులు, కవ్వల్ 6వార్డు సభ్యులు రాథోడ్ రాజునాయక్,కార్యకర్తలు భూక్యా సదసింగ్, రంగు రాకేష్, అనిల్ నాయక్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.





## జన్నారం మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చ్: 14,**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని కవ్వాల్ గ్రామ సర్పంచ్ సక్రూ నాయక్ కుమారుడు ఇటీవలే మృతి చెందారు విషయం తెలుసుకున్న. నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని . అండగా ఉంటాం అని ఓదార్చారు. మరియు కాంగ్రెస్ కార్యకర్త సత్తెన్నగౌడ్ మృతి చెందారు , వారి ఇంటికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ , ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు , స్థానికులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకున్ని పరామర్శించిన భూక్య జాన్సన్ నాయక్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చి: 14,**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని బాదంపల్లి గ్రామ వాస్తవ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిపతి ఆనందం ఇటీవల కాలు శస్త్రచికిత్స చేయించుకుని బాదంపల్లిలోని తమ నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా, ఈరోజు బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ భూక్యా జాన్సన్ నాయక్ .స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి సిపతి ఆనందంని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మనోధైర్యం కల్పించారు.వారి వెంట స్థానిక జన్నారం మండలం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు దుర్మరణం

**మన దునియా,మెదక్ జిల్లా కొల్చారం,రాంపూర్:మార్చి 14**

మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురిని అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టినట్లు సమాచారం. ఢీకొన్న ప్రభావంతో బైక్‌పై ఉన్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతులు మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



మన దునియా

RNI Number

మన అక్షరం - మన ప్రపంచం

# షుగర్ ఫ్రీ స్నాక్స్ ఆరోగ్యానికి మంచిదా?




కాలం మారుతున్న కొద్దీ మనం తినే ఆహారంలో కూడా విషపూరిత అంశాలు చేరిపోతున్నాయి. మనం రోజూ తినే ఆహారమే నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక వ్యాధులకు కారణం. మొదట్లో, చెడుకు బానిసలుగా ఉన్నవారు మాత్రమే అనారోగ్యానికి గురవుతారు. అయితే ఇప్పుడు మనం తినే ఆహారంలో కాస్త మార్పు వచ్చినా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో షుగర్, స్థూలకాయం, క్యాన్సర్ వంటి సమస్యలు పంచదారతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వస్తాయని చెప్పారు. అందువల్ల, చాలా మంది ప్రజలు చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం , చక్కెర లేని ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని గడుపుతున్నారని అనుకుంటారు. అయితే మనం అనుకున్నట్లుగా చక్కెర రహిత ఉత్పత్తులు నిజంగా ఆరోగ్యానికి మంచివేనా? దీని గురించి నిపుణులు ఏమంటారు? పేరు సూచించినట్లుగా, చక్కెరను ఉపయోగించకుండా చక్కెర రహిత ఉత్పత్తులు తయారు చేయబడతాయి . కానీ తీపి రుచిని అందించడానికి తక్కువ కేలరీలతో ప్రత్యామ్నాయ స్వీటెనర్లను ఉపయోగిస్తారు. అస్పర్టమే సాధారణంగా అటువంటి చక్కెర రహిత ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. వీటిని సాధారణంగా చూయింగ్ గమ్ , బేకింగ్ సోడాలో ఉపయోగిస్తారు. అస్పర్టమే కాకుండా, సాచరిన్ , సుక్రలోజ్ కూడా సాధారణంగా చక్కెర రహిత ఉత్పత్తులలో కనిపిస్తాయి. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఏమిటంటే, చక్కెరను ఉపయోగించకుండా తయారు చేసే ఈ షుగర్ ఫ్రీ ఉత్పత్తుల వినియోగం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా, పోషకాహార నిపుణుడు అమిత గాద్రే ప్రకారం, చక్కెర కంటెంట్ వినియోగంతో పోలిస్తే చక్కెర లేని స్వీట్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. ఉత్పత్తులు. కానీ షుగర్ లేదనే కారణంతో ఎక్కువగా తినడం ప్రారంభిస్తే సమస్యలు వస్తాయి. పండుగల సమయంలో తరచుగా భోజనం చేయడంలో తప్పులేదు. ప్రతిరోజూ షుగర్ ఫ్రీ ఉత్పత్తులను తీసుకోవడం ఖచ్చితంగా మంచిది కాదు. షుగర్ ఫ్రీ క్యాండీలలో కూడా మీరు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాటిలో మీ క్యాలరీలను పెంచే ఇతర పదార్థాలు ఉంటాయి. అమిత ప్రకారం, మీరు వారానికి ఒకసారి చక్కెర లేని ఉత్పత్తిని తీసుకోవచ్చు. మిఠాయిల కోసం మార్కెట్లకు వెళ్లినప్పుడు రెండు రకాల స్వీట్లు దొరుకుతాయి. ఒకదానిలో షుగర్ వాడలేదని రాసి ఉండగా, మరో దానిలో షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. మంచి ఆరోగ్యం విషయంలో దేన్ని ఎంచుకోవాలి అనే విషయంలో వినియోగదారులుగా మనం అయోమయం చెందడం సర్వసాధారణం. అయితే రెంటికి ఏమైనా తేడా ఉందా? లేక వీరిద్దరూ మిఠాయిల కోవకు చెందినవారే అనే సందేహం రావడం సహజం. వారు చక్కెరను ఉపయోగించరు లేదా చక్కెర రహితంగా లేబుల్ చేయబడిన ఉత్పత్తులలో చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఏ ఇతర ఉత్పత్తిని ఉపయోగించరు. కానీ ఆ మిఠాయిని తయారు చేయడానికి ఉపయోగించే ఇతర పదార్థాలు తీపి భాగం కలిగి ఉండవచ్చు. కానీ షుగర్ ఫ్రీ ఉత్పత్తులలో చక్కెర ఉండదు. బదులుగా, అస్పర్టమే, సాచరిన్ , సుక్రలోజ్ వంటి పైన పేర్కొన్న పదార్థాలు ఉపయోగించబడతాయి. వీటిలో ఏది తినాలనేది మన ఇష్టం.

## ఈ టీలు తాగితే చాలు.. బెల్లీ ఫ్యాట్ కరిగిపోవడం ఖాయం!



ప్రస్తుత రోజుల్లో స్త్రీ పురుషులు చాలామంది అధిక బరువు బెల్లీ ఫ్యాట్ సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా చాలామంది వారి సొంత పనులు చేసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు.కొన్ని కొన్ని సార్లు ఈ బెల్లీ ఫ్యాట్ కారణంగా బాడీ షేమింగ్ కామెంట్స్ ని కూడా ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. అయితే ఈ బెల్లీ ఫ్యాట్ ని కరిగించుకోవడం కోసం కొన్ని రకాల టీలు బాగా ఉపయోగపడతాయి అని చెబుతున్నారు. ఇంతకీ ఆ టీ లు ఏవి అన్న విషయానికి వస్తే.. బరువు తగ్గడానికి ఉపయోగించే టీలను స్లిమ్మింగ్ టీలు అని పిలుస్తారు. ఈ స్లిమ్మింగ్ టీకి దాని ప్రభావాన్ని అందించే రెండు ప్రాథమిక పదార్థాలు కెఫిన్ , పాలీఫెనాల్స్. అదనపు ట్రైగ్లిజరైడ్‌లను కరిగించే నిర్దిష్ట ఎంజైమ్‌ను ప్రేరేపించడం ద్వారా, పాలీఫెనాల్స్ భాగం శరీరంలో అధిక ట్రైగ్లిజరైడ్ ఏర్పడే ప్రమాదాన్ని తొలగిస్తుందట. అలాగే శరీరంలో కొవ్వును సైతం కరిగిస్తుందని చెబుతున్నారు. కాగా స్లిమ్మింగ్ టీ తాగడం వల్ల జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడుతుందట. ఇది శరీరంలో కొవ్వును చాలా తొందరగా కరిగిస్తుందని, ఇది వినియోగించే కేలరీల పరిమాణాన్ని కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు. కార్బోహైడ్రేట్లు, చక్కెరలను కొవ్వుగా మార్చకుండా శరీరాన్ని నిరోధిస్తుందట. ఇది శరీరంలో ని కొవ్వు పరిమాణాన్ని తగ్గిస్తుందని, మీరు బరువు తగ్గడానికి కొన్ని సులభమైన కార్యకలాపాలతో స్లిమ్మింగ్ టీని కూడా తాగేస్తే, సులభంగా బరువు తగ్గవచ్చని చెబుతున్నారు వైద్యులు. బయట మార్కెట్లో మనకు అనేక రకాల స్లిమ్మింగ్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిని తాగడం వల్ల ఈజీగా మీరు అధిక బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ ని కూడా కరిగించుకోవచ్చు.

## ఈ ఫేస్ ప్యాక్ ట్రై చేస్తే చాలు.. నిముషాల్లో స్కిన్ మెరిసిపోవాల్సిందే!

చాలామంది స్త్రీ పురుషులు అందంగా కనిపించడం కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చు చేస్తూ ఉంటారు. బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరుగుతూ, రకరకాల బ్యూటీ ప్రోడక్టులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకొందరు సహజంగా కనిపించే అందం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు ఫంక్షన్ల కోసం నిమిషాల్లోనే మెరిసిపోయే స్కిన్ కావాలని కోరుకుంటూ ఉంటారు. మరి అలాంటి వాళ్ళు ఎటువంటి ఫేస్ ప్యాక్ ట్రై చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అందులో మొదటిది శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ కూడా ఒకటి. ఈ ప్యాక్ చేయడానికి మీరు రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండి, ఒక టీస్పూన్ పసుపు పొడిని కలపాలి. పేస్ట్ చేయడానికి పాలు లేదా రోజ్ వాటర్ ఉపయోగించవచ్చు. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత శుభ్రం చేస్తే సరిపోతుందట. మరొక రెమిడీ విషయానికి వస్తే.. బంగాళదుంప అలోవెరా, శెనగపిండి ఫేస్ ప్యాక్.. అయితే ఈ ప్యాక్ చేయడానికి బంగాళదుంప గుజ్జు, అలోవెరా జెల్ , రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండిని కలపాలి. మీరు పేస్ట్ చేయడానికి నీటిని ఉపయోగించవచ్చు. ఈ ఙక్ ఫేస్ ప్యాక్‌ని అప్లై చేసి, మీ చర్మంపై 10 నిమిషాల పాటు ఉంచి, తర్వాత శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు. మరో ఫేస్ ప్యాక్ విషయానికి వస్తే.. నిమ్మకాయ టమాటో ఫేస్ ప్యాక్ తో ఇన్స్టాంట్ అందాన్ని పొందవచ్చు అని చెబుతున్నారు. మరి ఈ మిశ్రమాన్ని ఎలా తయారు చేసుకోవాలి అన్న విషయానికి వస్తే.. ఈ ప్యాక్ కోసం, టొమాటో గుజ్జును తీసుకొని, ఒక టీస్పూన్ నిమ్మరసం జోడించాలి. అలా అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత ముఖం శుభ్రం చేసుకోవాలి. మెరిసే చర్మం సొంతం కావాలి అనుకున్న వారు కాఫీ పాలు ప్యాక్ ట్రై చేస్తే చాలు. అందుకోసం ఈ రెండు పదార్థాలను 2:1 నిష్పత్తిలో కలిపి, మీ ముఖం మీద అప్లై చేయాలి. పాలలోని లక్షణాలు మీ చర్మానికి స్థితిస్థాపకతను నిర్ధారిస్తాయి. ఇది ముఖంపై ముడతలను తగ్గించడంతో పాటు, ముఖం మెరిసిపోయేలా చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.



## ఉద్యోగులు చేయి, మణికట్టు నొప్పితో ఎందుకు బాధపడుతున్నారు..?



నిరంతరం కంప్యూటర్ ముందు కూర్చునే వృత్తి నిపుణులు పని చేయడం సహజం. రోజులో ఎక్కువ భాగం పనికి కేటాయించడం అనేది కొంత మందిలో ఏదో ఒక అవసరం , ఆధునిక జీవనశైలి వలె దీనిని నివారించలేము అనేది కూడా వాస్తవం. చాలా మంది పని నిపుణులు పనిలో ఎక్కువ గంటలు గడపడం వంటి అనేక కారణాల వల్ల వేళ్లు, మణికట్టు, మోచేతులు , చేతుల్లో తీవ్రమైన నొప్పిని అనుభవిస్తారు. ఈ నొప్పిని తనిఖీ చేయకపోతే, ఇది దీర్ఘకాలిక చలనశీలత సమస్యలకు దారి తీస్తుంది. మీరు చేయగలిగే అనేక చేతి వ్యాయామాలు ఉన్నాయి, దీని కోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ మీకు మార్గనిర్దేశం చేయవచ్చు. ఆఫీసుకు వెళ్లేవారిలో చేయి నొప్పికి ఆరు సాధారణ కారణాల గురించి తెలుసుకుందాం. కంప్యూటర్‌ను ఉపయోగిస్తున్నప్పుడు టైపింగ్, మౌస్ ఉపయోగించడం, చేతిని నిరంతరం ఎత్తడం వంటి పునరావృత కదలికలు తరచుగా జరుగుతాయి, ఇది కండరాలు, స్నాయువులు , నరాలలో మంట , మైక్రోట్రామాకు దారితీస్తుంది. ఇది సాధారణంగా మణికట్టు, మోచేతులు , భుజాలను ప్రభావితం చేస్తుంది. కీబోర్డ్ , మౌస్ ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల తరచుగా చేతులు , మణికట్టులో నొప్పి వస్తుంది. కొన్నిసార్లు తప్పు టైపింగ్ టెక్నిక్ లేదా గ్రిప్ ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం మధ్యమధ్యలో చిన్నపాటి విరామాలు తీసుకోవడం, చేతులు, చేతులు, భుజాలను సాగదీయడం వంటి సాధారణ వ్యాయామాలు చేయవచ్చు. మీ కుర్చీ చాలా ఎత్తుగా లేదా చాలా తక్కువగా ఉంటే లేదా మీ డెస్క్ , మానిటర్ సరిగ్గా సర్దుబాటు చేయకపోతే, అది మీ మెడ, భుజాలు , చేతుల్లో ఒత్తిడిని కలిగిస్తుంది . ఈ నొప్పి మీ మణికట్టును ప్రభావితం చేసే కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ , స్నాయువుల వాపు వంటి టెండినిటిస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. మీకు సరిపోయేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఈ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. మీరు విరామం లేకుండా చాలా గంటలు పని చేస్తున్నారని గమనించండి. వ్యాయామం లేకపోవడం లేదా శారీరక శ్రమ లేకపోవడంతో పాటు పెరిగిన పని , ఒత్తిడి తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. టెన్నిస్ ఎల్బో లేదా గోల్ఫర్స్ ఎల్బో వంటి టెండినిటిస్ (కండరాల వాపు) వంటి పరిస్థితులను నిర్ధారించడానికి మీ వైద్యుడికి వైద్య పరీక్ష సహాయపడుతుంది , ఇవి మోచేయిని ప్రభావితం చేసే సాధారణ సమస్యలు. ముఖ్యంగా పునరావృత కార్యకలాపాలు చేసే వ్యక్తులలో ఈ నొప్పులు సర్వసాధారణం. అలాంటి నొప్పి లేదా అసౌకర్యం ఉంటే, వైద్యుడిని చూడటం మంచిది. ఒక వ్యక్తి పేలవమైన , నిష్క్రియాత్మక జీవనశైలిని నడిపించినప్పుడు , శారీరక శ్రమలకు తక్కువ సమయం ఇచ్చినప్పుడు, వారు కండరాల నొప్పి సమస్యను అభివృద్ధి చేయవచ్చు. అదనంగా, ధూమపానం లేదా ఊబకాయం , మునుపటి గాయాలు లేదా మధుమేహం , ఆర్థరైటిస్ వంటి సమస్యలను కలిగి ఉన్న వ్యక్తులు చేతులు , చేతుల్లో నొప్పిని కలిగి ఉంటారు. దీని కోసం, క్రమం తప్పకుండా స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి , మీ పని స్థలాన్ని మీకు సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోండి.


## తిప్పతీగ ఆకు తింటే తిప్పలన్నీ మాయం..



తిప్పతీగ ఆయుర్వేదంలో చాలా పురాతనమైన ఔషధ మొక్క. దీని ఆకులు, కాండం రెండూ అనేక ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. ఈ మొక్కలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.1. ఎముకలు: తిప్ప తీగను ప్రధానంగా ఎముకల బలహీనత, విరుగుడు గాయాలు (ఫ్రాక్చర్) సందర్భాలలో ఉపయోగిస్తారు. ఇది ఎముక కణాలను పునరుత్పత్తి చేస్తుంది. విరిగిన ఎముకలు మళ్లీ త్వరగా కుదించడానికి సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకల కండరాలను బలపరుస్తుంది.2. జీర్ణక్రియ: తిప్ప తీగ ఆకులను జీర్ణ సమస్యలకు ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగిస్తారు. ఇది అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. తిప్ప తీగ ఆకుల ముద్దను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది.3. బరువు తగ్గడం: బచ్చలి కూరను బరువు తగ్గించే ప్రక్రియలో కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో ఉండే కాంపౌండ్స్ కొవ్వును కరిగించి శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గిస్తాయి. ఇది శరీరంలో జీవక్రియను పెంచుతుంది. తద్వారా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది. 4. చక్కెర నియంత్రణ: తిప్పతీగ ఆకులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారికి ఇది ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ మొక్కలోని రసాయనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. అందువలన, ఇది మధుమేహం ప్రభావాన్ని తగ్గిస్తుంది. 5. కీళ్లనొప్పులు: తిప్ప తీగలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. కీళ్లనొప్పులు వంటి వ్యాధుల నివారణలో ఈ మొక్కను ఉపయోగించడం వల్ల శరీరంలోని కీళ్లలో మంట మరియు నొప్పులు తగ్గుతాయి. జాయింట్ సెన్సిటివిటీని తగ్గించడం ద్వారా జాయింట్ ఫ్లెక్సిబిలిటీని మెరుగుపరుస్తుంది. 6. చర్మ సమస్యలు: తిప్ప తీగ ఆకులు చర్మ సమస్యలకు ఉపయోగపడతాయి. ఇందులోని క్రిమినా శక లక్షణాలు కోతలు, కాలిన గాయాలు, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి చర్మ సమస్యలను నివారిస్తాయి. ఆకును రసాన్ని తీసుకుని చర్మానికి రాసుకుంటే చర్మంపై జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

## అందం కోసం విలువైన రహస్యం పటిక

పటిక అనేది బహుముఖ సహజ నివారణ. పటికను మీరు సాధారణంగా కొన్ని షాపుల్లో చూసే ఉంటారు. ఈ పటికలో క్రిమి సంహారక గుణాలు కలిగి ఉండడంతో, గాయాలైనప్పుడు రక్తం కారిపోకుండా పటిక కాపాడగలదు. ఇందులోని పొటాషియం, అల్యూమినియం, సల్ఫేట్ అనే రసాయన పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరిస్తాయి. ఇది జుట్టును శుభ్రపరచడంలో, శరీరంపై ముడుతలకు చికిత్స చేయడంలో, చెమటను నియంత్రించడంలో, చిగుళ్ల రక్తస్రావం నుండి ఉపశమనం పొందడంలో ఇంకా మూత్ర ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి మరియు చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి, చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మంపై ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. పటిక నీటితో జుట్టు కడగడం వల్ల తలపై ఉన్న జుట్టులో ఉండే మురికి, పేలు వంటి తొలిగిపోతాయి. పటికను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం మీ జుట్టును కడగాలి. యూరిన్ ఇన్ఫెక్షన్ నుండి ఉపశమనం కలిగించేందుకు ప్రైవేట్ పార్ట్ లను శుభ్రం చేయడానికి పటిక నీరు ఉపయోగపడుతుంది.



పటిక పొడి శరీరంలో వాపు, నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ప్రభావిత ప్రాంతంపై దీన్ని పూయడం మంచిది. పటిక నీటిని ముఖానికి పట్టించడం వల్ల ముడతలు తగ్గుతాయి. రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది. పటిక చెమట వాసనను తగ్గించడంలో సహాయపడుతుంది. పటిక నీటితో స్నానం చేయడం వల్ల చెమట సమస్య తగ్గుతుంది. పటిక నీటితో పుక్కిలించడం చిగుళ్ల నుండి రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తుంది. నోటి దుర్వాసనను కూడా తగ్గిస్తుంది.

# వివాదాస్పద రనౌట్... పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ ఆఘూకు ఐసీసీ మందలింపు



బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ బ్యాటర్ సల్మాన్ ఆఘా ఐసీసీ చర్యలకు గురయ్యాడు. విచిత్ర రీతిలో రనౌట్ కావడంపై అసహనం వ్యక్తం చేస్తూ క్రికెట్ పరికరాలను దురుసుగా విసిరికొట్టినందుకు అతడిని మందలించడంతో పాటు, ఒక డిమెరిట్ పాయింట్‌ను జతచేశారు. శుక్రవారం షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సల్మాన్ ఆఘా, మహ్మద్ రిజ్వాన్ కలిసి 109 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ 39వ ఓవర్‌లో బంగ్లా కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ వేసిన బంతిని రిజ్వాన్ నెమ్మదిగా పుష్ చేశాడు. నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో క్రీజు బయట ఉన్న పాక్ బ్యాటర్ ఆఘా వద్దకు బంతి దొర్లుకుంటూ వచ్చింది. అతడు బంతిని చేత్తో పట్టుకుని బౌలర్‌కు తిరిగి ఇవ్వబోయాడు. వెంటనే అప్రమత్తమైన మిరాజ్... ఆఘా కంటే ముందే ఆ బంతిని అందుకుని వికెట్లను గిరాటేశాడు. ఆఘా క్రీజు బయటే ఉండటంతో థర్డ్ అంపైర్ అతడిని రనౌట్‌గా ప్రకటించాడు. ఈ ఊహించని పరిణామంతో తీవ్ర నిరాశకు గురైన సల్మాన్ ఆఘా, పెవిలియన్‌కు వెళుతూ కోపంతో తన గ్లోవ్స్‌ను నేలకేసి కొట్టాడు. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2ను ఉల్లంఘించడమే. ఈ విషయంపై మ్యాచ్ రిఫరీ నేమూర్ రషీద్ 'ది డైలీ స్టార్'తో మాట్లాడుతూ.. "సల్మాన్‌కు గతంలో ఇలాంటి ప్రవర్తనకు పాల్పడిన చరిత్ర లేదు. అన్ని అంశాలను, ఐసీసీ నిబంధనలను పరిగణలోకి తీసుకుని అతడిని మందలించి, ఒక డిమెరిట్ పాయింట్ ఇచ్చాం" అని వివరించారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 274 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా బంగ్లాదేశ్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 243 పరుగులుగా నిర్దేశించగా, ఆ జట్టు కేవలం 114 పరుగులకే కుప్పకూలింది. దీంతో సిరీస్ 1-1తో సమం అయింది. ఆదివారం నిర్ణయాత్మక మూడో వన్డే జరగనుంది.

# అది వ్యూహాత్మకమే.. తప్పేమీ లేదు: వివాదాస్పద రనౌట్‌పై బంగ్లా కెప్టెన్ మిరాజ్

ఢాకా వేదికగా బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య జరిగిన రెండో వన్డేలో స్కోరు కంటే ఒకే ఒక్క సంఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. క్రీడాస్ఫూర్తికి, నిబంధనలకు మధ్య ఉన్న గీతను చెరిపేస్తూ బంగ్లా కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ చేసిన ఓ రనౌట్ పెను దుమారం రేపింది. ఈ ఘటనతో క్రీడాలోకంలో మరోసారి 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్'పై వాడివేడి చర్చ మొదలైంది.

**అసలేం జరిగిందంటే..!**

పాకిస్థాన్ ఇన్నింగ్స్‌లో 39వ ఓవర్ వేస్తున్నాడు మిరాజ్. ఆ సమయంలో క్రీజులో మహమ్మద్ రిజ్వాన్, నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో సల్మాన్ అలీ అఘా ఉన్నారు. రిజ్వాన్ ఆడిన బంతి నేరుగా బౌలర్ మిరాజ్ వైపు వచ్చింది. దాన్ని అతను కాలితో ఆపాడు. బంతిని తిరిగి బౌలర్‌కు ఇచ్చేందుకు నాన్-స్ట్రైకర్ అఘా క్రీజు దాటి ముందుకు వచ్చాడు. అయితే, అఘా బంతిని అందుకునేలోపే, మిరాజ్ వేగంగా దాన్ని తీసుకుని వికెట్లను గిరాటేశాడు. ఆ సమయంలో అఘా క్రీజు బయట ఉండటంతో థర్డ్ అంపైర్ అతన్ని ఔట్‌గా ప్రకటించాడు. ఈ అనూహ్య పరిణామంతో అఘా తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. కెప్టెన్ మిరాజ్, వికెట్ కీపర్ లిటన్ దాస్‌తో తీవ్రంగా వాగ్వాదానికి దిగాడు. పెవిలియన్ వైపు వెళుతూ తన హెల్మెట్, గ్లోవ్స్‌ను కోపంగా విసిరేశాడు. అప్పటివరకు మంచి స్థితిలో ఉన్న పాకిస్థాన్, ఈ వికెట్ తర్వాత కుప్పకూలింది. కేవలం 43 పరుగుల వ్యవధిలోనే చివరి 7 వికెట్లను కోల్పోయింది.

**వ్యూహాత్మకమే తప్ప క్రీడాస్ఫూర్తికి విరుద్ధం కాదు: మిరాజ్**

మ్యాచ్ అనంతరం ఈ వివాదంపై మిరాజ్ స్పందించాడు. తాను చేసింది వ్యూహంలో భాగమే తప్ప, క్రీడాస్ఫూర్తికి విరుద్ధం కాదని స్పష్టం చేశాడు. "అతను క్రీజుకు దూరంగా ఉన్నాడు. ఒకవేళ బంతిని నేను మిస్ చేసి ఉంటే, వాళ్లు పరుగు కోసం ప్రయత్నించేవారేమో. అందుకే నేను అలా ఆలోచించాను. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అతని ఉద్దేశం ఏమిటో నేను ఊహించలేను" అని తన చర్యను సమర్థించుకున్నాడు. బ్యాటర్ ఏకాగ్రత కోల్పోవడాన్ని తాను అవకాశంగా మలుచుకున్నానని వివరించాడు. ఈ మ్యాచ్‌లో పాక్ డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం 128 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను సమం చేసినప్పటికీ, ఈ రనౌట్ వివాదమే ప్రధానంగా నిలిచింది. ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమని కొందరు మాజీ క్రికెటర్లు విమర్శిస్తుండగా, నిబంధనల ప్రకారం మిరాజ్ చేసింది సరైందేనని మరికొందరు వాదిస్తున్నారు. సిరీస్ నిర్ణయాత్మక చివరి మ్యాచ్‌పై ఈ ఘటన ప్రభావం కచ్చితంగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# బ్యాడ్మింటన్ స్కోరింగ్ మార్పులపై వ్యతిరేకత వ్యక్తం చేసిన సైనా నెహ్వాల్



భారత బ్యాడ్మింటన్ దిగ్గజం సైనా నెహ్వాల్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య ప్రతిపాదిస్తున్న స్కోరింగ్ మార్పులపై తన వ్యతిరేకతను వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 21 పాయింట్ల (3ఇ21) విధానాన్ని మార్చి, దాని స్థానంలో 15 పాయింట్ల (3ఇ15) విధానాన్ని తీసుకురావాలనే ఆలోచనను ఆమె తీవ్రంగా వ్యతిరేకించింది. పాత విధానమే (21 పాయింట్లు) క్రీడాకారుల ఓర్పును, ఆట అసలైన నైపుణ్యాన్ని పరీక్షిస్తుందని ఆమె అభిప్రాయపడింది. డెన్మార్క్‌లోని హెర్సెన్స్‌లో ఏప్రిల్ 25న జరగనున్న బీడబ్ల్యూఎఫ్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ 15 పాయింట్ల విధానంపై ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో, ఇంటర్నేషనల్ మూమెంట్ టు యునైటెడ్ నేషన్స్ సలహాదారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సైనా, ఆట స్ఫూర్తిని కాపాడాలని పిలుపునిచ్చింది. 15 పాయింట్ల విధానం వల్ల ర్యాలీలు తగ్గిపోయి, ఆట నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని, ఇది కేవలం అదృష్టంపై ఆధారపడేలా మారుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. కాబట్టి, అధికారులు వాణిజ్య పరమైన కోణంలో కాకుండా... క్రీడాకారుల సంక్షేమం, ఆట సాంప్రదాయం వైపు నుంచి ఆలోచించాలని కోరింది.

# ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెవిన్ పీటర్సన్ గుడ్ బై.. కామెంటరీ బాక్స్‌లో కలుసుకుందాం అంటూ కామెంట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిషన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఫ్రాంచైజీకి వీడ్కోలు పలుకుతున్నట్టు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ తెలిపాడు. జట్టు మెంటార్ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు శనివారం ప్రకటించాడు. అయితే, ఈ లీగ్ లో గతంలో మాదిరే కామెంటేటర్‌గా కొనసాగుతానని స్పష్టం చేశాడు. గతేడాది ఫిబ్రవరిలో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం పీటర్సన్‌ను మెంటార్‌గా నియమించింది. హెడ్ కోచ్ హేమాంగ్ బదానీ, అసిస్టెంట్ కోచ్ మాథ్యూ మోట్, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ వంటి సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి కేపీ పనిచేశాడు. "ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటార్‌గా కొనసాగలేను. ఈ బాధ్యతలకు అవసరమైన సమయాన్ని కేటాయించలేకపోతున్నాను. ఆటగాళ్లందరికీ శుభాకాంక్షలు. అయితే, కామెంటరీ బాక్స్‌లో మళ్లీ కలుస్తాను" అని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశాడు. దక్షిణాఫ్రికాలో జన్మించిన పీటర్సన్, ఇంగ్లండ్ తరఫున 104 టెస్టులు, 136 వన్డేలు ఆడాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచి ఇంగ్లండ్‌కు తొలి ఐసీసీ ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణే జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఇదిలా ఉండగా, బీసీసీఐ ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 వరకు 20 మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల కారణంగా పూర్తి షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని బీసీసీఐ తెలిపింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



## పండంటి బిడ్డకు జన్మనిచ్చిన సినీ నటి పూర్ణ

టాలీవుడ్ నటి, 'ఢీ' ఫేమ్ పూర్ణ (షామ్నా ఖాసిమ్) తన అభిమానులతో ఒక సంతోషకరమైన వార్తను పంచుకున్నారు. ఆమె రెండోసారి తల్లి అయ్యారు. ఈ ఉదయం 4.25 గంటలకు ఒక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా ఆమె ప్రకటించారు. తన జీవితంలోకి వచ్చిన ఈ చిన్నారి అపురూపమైన కానుక అని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా డెలివరీ సాఫీగా జరిగినందుకు దేవుడికి, ఆసుపత్రి సిబ్బందికి పూర్ణ తన కృతజ్ఞతలు తెలిపారు.పూర్ణకు 2022లో దుబాయ్ వ్యాపారవేత్త షానిద్ ఆసిఫ్ అలీతో వివాహం జరిగింది. వీరికి 2023లో బాబు హమ్దాన్ జన్మించాడు. ఇప్పుడు మరోసారి తల్లి అయినట్టు పూర్ణ తీపి కబురు అందించారు. ఈ సందర్భంగా సినీ తారలు, అభిమానులు పూర్ణ దంపతులకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు.

## ఆదిత్య, యామీల పతనం కోసం ఇండస్ట్రీ వేచి చూస్తోంది: రామ్ గోపాల్ వర్మ

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో వేడిని పుట్టిస్తున్నాయి. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ ప్రతిభను ఆకాశానికెత్తుతూనే, చిత్ర పరిశ్రమలో ఆయన ఎదుర్కొంటున్న అసూయను వర్మ బయటపెట్టారు. ఆదిత్య ధర్, ఆయన భార్య, నటి యామీ గౌతమ్‌ల పతనం కోసం పరిశ్రమ మొత్తం వేచి చూస్తోందని వర్మ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. ఆదిత్య ధర్ తెరకెక్కించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్' చూసినప్పటి నుండి తాను ఆయనకు అభిమానిని అయిపోయానని వర్మ చెప్పుకొచ్చారు.ఆదిత్య ధర్ సినిమా మేకింగ్‌లో సరికొత్త పద్ధతులను, కథ చెప్పే తీరులో కొత్త గ్రామర్‌ను ప్రవేశపెట్టారని వర్మ కొనియాడారు. ఆయన ప్రభావం ఎంతలా ఉందంటే, టాలీవుడ్‌లో రాబోయే పలు భారీ బడ్జెట్ యాక్షన్ సినిమాలు 'ధురంధర్' మేకింగ్ స్టైల్‌ను చూసి తమ షూటింగ్‌లను ఆపేసి మరీ రీ-షూటింగ్ చేసుకుంటున్నాయని వెల్లడించారు. దీనివల్ల నిర్మాతల పై బడ్జెట్ భారం పడుతోందని, అందుకే పరిశ్రమకు ఆయనపై కోపం, అసూయ పెరిగిపోయాయని వర్మ విశ్లేషించారు. ఆదిత్య, యామీలు ఎప్పుడు తప్పు చేస్తారా? అని అందరూ ఎదురుచూస్తున్నారని ఆయన షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ వర్మను విమర్శిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన 'ధురంధర్' మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 1300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డు సృష్టించగా, ఇప్పుడు దాని సీక్వెల్ 'ధురంధర్: ది రివెంజ్' విడుదలకు సిద్ధమైంది. నిజానికి ఈ సినిమా యష్ నటించిన 'టాక్సిక్'తో తలపడాల్సి ఉండగా, అది వాయిదా పడటంతో ఇప్పుడు పవన్ కల్యాణ్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పోటీ పడబోతోంది. మార్చి 19న ఈ రెండు భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఢీకొట్టబోతుండటంతో సినీ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.





## రణవీర్ తో కలిసి నటించడం నా డ్రీమ్: భూమి పెడ్నేకర్

బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని మాటను బయటపెట్టారు. రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్' చూసిన తర్వాత ఆ సినిమా మేకింగ్‌కు తాను ఫిదా అయ్యానని, దర్శకుడు ఆదిత్య ధర్, రణ్‌వీర్ సింగ్‌లతో కలిసి పనిచేయడం తన కల అని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా మితిమీరిన మాస్ ఎలిమెంట్స్ ఉండే చిత్రాలు చూస్తే తనకు నిద్ర వస్తుందని, కానీ 'ధురంధర్' మాత్రం తనను కట్టిపడేసిందని భూమి నిజాయతీగా చెప్పారు. సినిమా కలెక్షన్ల ధోరణిపై కూడా భూమి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పరిశ్రమలో 'ఓపెనింగ్ వీకెండ్' కలెక్షన్ల ఆధారంగానే సినిమా ఫలితాన్ని నిర్ణయించేస్తున్నారని, దీనివల్ల కంటెంట్ ఉన్న చిన్న సినిమాలు థియేటర్లలో నిలబడలేకపోతున్నాయని ఆమె విశ్లేషించారు. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు నెమ్మదిగా ప్రేక్షకాదరణ పొందుతాయని, కానీ శుక్రవారం నాటి అంకెలను చూసి జడ్జిమెంట్ ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆమె ఇమ్రాన్ ఖాన్ చాలా కాలం తర్వాత తిరిగి వెండితెరపైకి వస్తున్న 'అధూరే హమ్ అధూరే తుమ్' చిత్రంలో నటిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com